అనుబంధాలు, అనురాగాలు, ఆప్యాయతలు, ఆత్మీయతలను
కొలవడానికి ఏ లోతులూ సరిపోవు, తూయడానికి ఏ బరువులూ
సరితూగవు, ఏ కాలమానినికి అంతు చిక్కవు. వాటిని చూసే గుణమే కాదు,
పంచే మనసూ ప్రధానమే. అర్థం చేసుకుంటే అన్నీ అపురూపాలే.
ఆ అపురూపాల మరో కోణం...

కొట్టం రామకృష్ణారెడ్డి

# 13

# ఇగురం గల్లోడు





## అల్లుడు

‘అజ్ఞానానికి మించిన ఆనందం లేదు  ఆనందానికి మించిన ఆయుర్దాయం లేదు’... అననీకె నిలువెత్తు ఆనవాలు మా మామ. ఆయన ఘడియంతసేపు ఊకె గూసునుడు, చిటికెనేలంత చింత చేసుడు ఇదివొరకటి దాంక సూశింది లేదు. తెట్టుగ తెల్లారకముందే బాయి మొకానబడి పోతే మల్ల పొద్దుమూకింతల సూర్యుడు పడమటి మొకాన మునిగినంకనే ఈన ఆకిట్లకు అడుగుపెడతడు.

మా మామ సంగతి ఇయ్యాల నేను చెప్పుడు ఎందుకంటే... గీనసొంటి మొండి మనిషిని ఇప్పటిదాంక ఈ దునియల సూడలే. రాజు గొప్పోడా లేకుంటే మొండోడు గొప్పోడా అనంటే నేనైతే గింత గూడ సొంచాయించకుండ జప్పున జెప్త, మా మామనే గొప్పోడని. ఇప్పటిదాంక ఎవడేం చెప్పినా ఆయన చెవ్వు మీద పేను వారుడు సూడనే సూడలే. అందరు చెప్పింది ఇంటడు గని ఆయనకి అనిపించింది సేస్తడు. ఆ సేసేది గూడ ఎవర్కి గింత ఆయమియ్యడు.

ఇంత ఇగురం ఉన్నోడు ఎంత తెలివిమంతుడో అనుకుంటరు ఎవ్వరన్నా...కానీ...ఆయన తెలివి ఏ యవ్వారమైన సేస్తేనే గద తెల్సేది? ఇంట్ల పనీ బయట పనీ... అన్నీ మా అత్తమ్మనే సూస్కుంటది. ఇంట్లకి ఉప్పు మిరపకాయ కాడికెల్లి మామ తొడుగుకునే పంచె కమీజు దాంక గామెనే కొనుకొస్తది గని ఈన గదిగూడ తెచ్చుకోడు. పాలను పాలబూత్‌ల పోసుడు కాడికెల్లి ఒచ్చిన పంటను అమ్ముకొచ్చే దాంక అన్నీ అత్తమ్మనే సూసుకుంటది. ఇంట్ల ఇగురం ఇంటామె చెయ్యాలె... బయట పెత్తనం మొగోడు చెయ్యాలంటరు గని మా అత్తగారింట్ల అన్ని జరుగుబాట్లు మా అత్తమ్మనే సేస్తది.

ఈనకు ఇల్లు, పొలం, బర్రె, పెండ శేను, పురుగు తప్ప ఇంకేం తెల్వనే తెలవది. ఒక సుట్టము తెల్వది ఒక పక్కము తెల్వది. ఎవ్వని తావలకు బోడు. ఎవ్వరైనా ఆయన తానికే రావాలె. ఒక పెండ్లికీ బోడు ఒక సావుకూ బోడు. పెండ్లికీ సావుకీ పొయ్యిండంటే అది ఉండూర్ల ఉంటనే పోతడు... గంతే.

అసలాయ్న ఊరిడిసి పోంగ సూశిన్నంటే అది కొడుకు పెండ్లిల్లనే. పెండ్లిళ్లు ఆడివిల్లల ఇండ్ల కాడ అయితయని, అందుకనే ఇగ తప్పదని కొడుకు అత్తగారింటికి పోవాల్సొచ్చింది. అరె! నా పెండ్లయ్యి ఇన్నేండ్లయ్యింది ఒక్కసారంటే ఒక్కసారి గూడ మా ఊరు మొకం సూశ్న పాపాన పోలేదు!

యాడాదికొక్కసారొచ్చే పండ్గలకు బిడ్డెను తోల్కపోనీకె గూడ బామ్మర్దినో లేకుంటే అత్తమ్మనో ఒస్తది గని మా మామ మాత్రం మా ఇంటికి ఇయ్యాల్టి దాంక రానే రాలే. ఇగ నాకైతే తప్పదాయె. పెండ్లాం ఎన్క పోవుడు ఎవర్కి తప్పుతదిగని.

ఇగ మర్యాదలకేం తక్వలేదు అత్తగారింట్ల. బాయికాడికెల్లి ఒచ్చేటప్పుడు ఏదో ఒకటి పట్టుకొస్తడు. కోడిపుంజునో, కుందేలు పిల్లనో, బుర్కపిట్టెనో, కంజుపిట్టెనో యాదో ఒకటి పట్టుకొస్తడు గని ఆయన మాత్రం నీసు ముట్టడు. ఆఖర్కి గుడ్డు కూడ దినడు. అదే సాలు నా పెండ్లానికొచ్చింది, నాకు నోరు సచ్చింది. అత్తగారింట్ల నేనొక్కన్నే రాచ్చసుడి లెక్క సియ్యలు దినాలంటే సిగ్గయితది. ఇగ నీసు ముట్టనోల్లు నాకు సీసలేడికెల్లి తెస్తరు? మనమేమన్న రోజు గొంతుల్దాంక తాగి గంతులేస్తమా గని... అరె, ఎన్నడన్న ఇంటికి సుట్టమొస్తెనో, పండుగొస్తెనో గింత క్వార్టరో, గింత బీరు సీసనో తాగితే మనసు నిమ్మలమయితది. నెగీ బాపనోల్లింట్లోచ్చి పడ్డట్టయ్యింది. ఇగ ఏం జేస్తం గని. ఎవ్వరి తోవలు ఆల్లవి. మన తోవలకు ఆళ్లు రారు. ఆళ్ల తోవలకు మనం బోము.

అల్లుడన్నంక అత్తగారింటి నుంచి ఒచ్చే సొమ్ము మీద గింతనన్న ఆశ పెట్టుకుంటడు. నాకైతే ఆ ఆశ గూడ లేనే లేదు. పెండ్లినాడు పుస్తె మెట్టెలు, కట్టు బట్టలు తప్ప నాకు అత్తగారింటి నుండి ముట్టింది ముత్తెమంత గూడ లేదు. దేన్నికైన నోసుకుని పుట్టాలె.

మూడేండ్ల కింద ఓనాడు మండలంల పాలకేంద్రం ఎన్కనే ఒక ప్లాటున్నదని, కొనుక్కుందామని ఆలుమగలం అనుకున్నం. అందుకు జరన్ని పైసలు తక్వయినయి. ఎవర్నో అడుగుతే ఎందుకిస్తరు. మంది ముందల చెయ్యి సాపుడెందుకని మా మామను అడుగుదామనుకున్న. గాయన్ను నోరు దెర్సి నేనెట్లడుగుత? గందుకని ఈమెను అడగమన్న... ఈమేమన్న తక్వదా... ఆయన నోట్లకెళ్లే కద ఊడివడ్డది. 'మా నాయన నాకిదివొరకటి దాంక ఏం తక్వజెయ్యలె... ఎప్పుడు నేను నోరు దెర్సి అడగక ముందే అన్ని ఇచ్చిండు... ఇప్పుడు గూడ నేనడగను... అంత తిప్పలైతే నువ్వే అడుక్కో,' అని పుసుక్కున నన్ను బిచ్చపోన్ని చేసేసింది.

పెండ్లాం గంత మాటన్నంక ఇంకేం చేస్తమని శెరం దప్పి మా మామ ముంగల బిచ్చపోన్నయిన. ఇంటల్లుడు నోరు దెరిసి అడిగిండని గూడ లేకుండ, 'నా తానేడు

న్నయి... ఉన్న నాడు మీకియ్యకుంటె ఇంకెవలికిస్త,' అని చేద బాయిలేసిన చాంతాడు పుటుక్కున తెంపిండు.

'ఎన్నాకులు రాల్తే ఈతాకు రాల్తది?' అనుకుంట కింద మీద వడి అందిన కాడికి బదలు తీస్కొచ్చి ఆ ప్లాటు కొనుకున్నం.

ఇగ గిన్నేండ్లయినంక జరన్ని పైసలు చేతుల తన్లాడుతుంటే... ఆ ప్లాటు జాగల నాలుగర్రలన్న ఎసుకుందామని ఈమె నా చెవుకాడ జోరీగలెక్క దినాం గున్సుడు షురూ జేసింది. గంత ప్రేమగ పెండ్లాం అడిగితె కాదనెట్లంటమని... అంతే ప్రేమగ, 'మీ నాయనను గింత ఆసరయితడేమో అడగరాదు' అనన్న... గంతే, మూతిని ముప్పై ఆరొంకల తిప్పి, 'నీకు చాత గాకపోతే నువ్వే అడుక్కో,' మని మల్ల నన్ను బిచ్చపోన్ని చేద్దామనుకున్నది.

త్యాపకోసారి బిచ్చపోన్ని గావుడు నాకేం ఫరక్ పడ్తది గని, మా మామ మల్ల గవ్వే చిల్క పల్కులు పల్కుతడేమోనని నాకు ఫికరు పట్టుకున్నది. ఎట్లనన్న ఉపాయం జేసి రేగ్గంప మీదారేసిన బట్టను సుతారంగ తీయాలెనని సొంచాయిస్తున్న.

ఏం జేస్తుండో మల్ల... మస్తుగా పంట దీసి కూడబెడుతున్నదంత కొడుకు కొరకేనని నాకు తెలుసు గని, గింత వాసన రానిస్తలేడు బయటకు.

**కోడలు**

అత్తలకు కోడండ్లకు పడ్తలేదంటే అర్థముంది... కని, మామకు కోడలుకు పడక పోవుడు నేనైతే ఏడ సూడలె!

మా మామకు నాకు నడిమద్దెల ఎసోంటి దుష్మని లేదు గని నేనంటే ఆయ్న గింత గూడ సైసనే సైసడు. ఎసోంటి యాల మొకం జూసుకున్నమో ఏమో?

ఈడ ఇంగో ఇచ్చంత్రం ఏందంటే నాకు మా అత్తకు మంచి సోపతే జతయింది. మా అత్తగారింట్ల నాకు అత్త మా మామనే! పసుపు బట్టలతోని అత్తగారింట్ల అడుగువెట్టి నప్పటి సంది అంతనే... నన్ను పరాయిదాన్ని సేశేశిండు. ఎన్నడు నన్ను ఇంట్ల మనిషి లెక్క సూడనే సూడలె. ఒక్కనాడు పన్నెత్తి ఒక్క మాట గూడ మాట్లాడలే.

అంతో ఇంతో మా అత్తనే నయ్యం. గియ్యాల్టి దాంక నన్నెన్నడు ఒక్క మాట అనలె. ఎన్నడన్న పండ్గకో పబ్బానికో ఒస్తే ఏమన్న పని జెప్పనీకె గూడ ఎన్క ముందు అయితుండె. అన్ని పనులూ ఆమెనే చేస్కుంటుండే. నాకే... ఊకుండబుద్ధి గాక ఆ పని ఈ పని చేస్తుంటి. ఆడికి మా అత్త మొత్తుకుంటనే ఉంటది. 'ఆడ ఎట్లా తప్పది... ఈడికి ఒచ్చిన నాల్గు దినాలన్న కుదార్తంగ గూసోని తినక గివ్వేం తిప్ప'లని గుల్గుతనే ఉంటది.

ఊర్ల సుట్టుపక్కలున్న అత్తలు కోడండ్లయితే చేతులన్ని తిప్పుకుంట, 'అత్త కొంగు పట్క తిరిగే కోడలును యేడ సూడకపోతిమమ్మా, మీరు గాక అత్తలు కోడండ్లయితిరి,' అనుకుంట ముక్కుల మీద ఏల్లేసుకునేటోళ్లు.

ఇగ ఈనసైతే అళ్ల నాయన మీద ఈగను కూడ వాలనీయకపోతుండె. ఊరోల్లందరి తోవ ఒకటైతే ఊసు గన్లోంది ఇంకో తోవని ఊకనే అనలేదు. ఊళ్లెకు అడుగు వెట్టిన సంది నాయన గోచి వట్టుకునే తిరుగుతడు. పొద్దుగాల నాయనెంట బాయి కాడికి తయారయి... ఆ వెనక ల్యాగ దూడె లెక్క పోతడు. ఓ జతగాడు లేకపాయె! ఓ సోపతి గాడు లేకపాయె! ఇంటికాడుంటె అమ్మెనక ... బాయికాడికి నాయనెంక... చిన్నపోరని తీర్గనే సేస్తడు. అరె! ఇద్దరు పిల్లలయ్యింఁడ్రు ... ఇంకా సంటిపోరని లెక్కనే అమ్మయ్య తాన గార్వాల పడ్తడు.

పట్నంల ఉన్నన్ని రోజులు బాగనే ఉంటడు, బాగనే ఇంటడు... గీడికి మా మామ తానికి రాంగానే ఏమయితదో ఏమో, గింత చిన్న మాట గూడ చెవినేసుకోడు. అన్ని అయ్య బుద్ధులే ఈనకు.

ఇగ మా మామ గురించి ఎంత చెప్పుకున్నా ఇంకా అంతో ఇంతో మిగిలే ఉంటది. అదేమన్న ఒడ్సే ముచ్చటనా గని. పెండ్లయ్యి నాలుగొద్దులు అయినంక గాడ పట్నంల కొత్తగ కాపురం బెట్నమా? గాయల్లటి సంది నువ్వొద్దె ఇయ్యాల్టి దాంక మా ఇంటి గడప తొక్కలే మా మామ. మంచికో చెడుకో పిల్లలకు సుస్తైందని చెప్పి పంపినా ఎన్నడు మా తాన్కి రాకపాయె. ఎన్నడొచ్చినా కిందా మీద వడి మా అత్తనే రావాలె గని ఆయన మటుకు ఊరిడిసి పెట్టి రాలే.

బతుకమ్మ పండ్గకో, బోనాలకో అమ్మగారింటికి యాడాది కొక్కసారి పోతనంటే ఒద్దంటే ఒద్దనేది మా అత్త. నేను పోతనంటే పోతనని మొండిగ కూసుంటే, 'ఒద్దె... మామ ఒద్దన్నడు... మల్ల కోపమైతడు,' అని బుగులు పట్టిస్తుండేటిది.

యాడాదికొక్క పాలొచ్చే పెద్ద పండ్గకు గూడ అమ్మగారింటికి పోనియ్యక పోయ్యేది మా మామ. ఏమనాలె ఈ మనిషిని? ఎట్లర్తం చేస్కోవాలె? మల్ల చిన్న పండ్గకూ... పెద్ద పండ్గకూ బిడ్డెను తోలుకొచ్చుకుంటడు. బిడ్డెకో న్యాయం కోడలుకో న్యాయమా?

ఇగ మా ఆడబిడ్డయితే ఎప్పుడు అమ్మ గారింటికాడనే కానొస్తుండె. అయితారం... అయితారం మొగుడ్ని ఎంటబెట్టుకొని అమ్మ గారింటికాడ వాలిపోతుండె. ఉండేది మండలంలనే నాయె... గంట తోవ. శనివారం ఒస్తే మల్ల సోమారం పొద్గాల

దాంక అమ్మగారింటిమీద పడి పెండ్లాం మొగడు పిల్లలతోని పడి తిని పొయ్యేది. ఇంగ పండ్గలకైతే ఆరం పద్దినాల సంది ఈడనే మకాం పెట్టేటోల్లు.

ఆళ్లనని ఏం సింగారం గని... మన బంగారం మంచిదయితే కద? ఒడ్డించే టోడు మనోడైతే... బంతిల యాడ గూసున్నా మంచి తున్కలే ఏస్తడు. మా మామ చేశ్న కష్టం అంత ఆళ్లకే దోసిపెడ్తున్నరు. ఉప్పు మిరపకాయ కాడికెల్లి అంత ఈడికెల్లే కొండవోతరు.

మొన్ననే మా ఆడబిడ్డోల్లు మండలంల ప్లాటు కొనుక్కున్నరు. దానికెంత సదిరి చ్చిండో మా మామ. ఇగ ఇల్లు కడ్తరంట దానికెన్ని సుదరాయిస్తాడో ఏమో? ఉన్నదంతా ఆళ్లకే సదిరిస్తే మల్ల నా చేతిల నా పిల్లల చేతులల్ల చిప్పనే పెడ్తడు. కాలు జేతులు మంచిగ పంజేసినన్ని దినాలు గిట్లనే జేత్తరు. ఎప్పటికిట్లనే ఉంటారా గని? రేపు మూలకు పడ్డంకనో... రోగమో రొష్టో ఒచ్చినంక ఎవలు జేత్తరు?... ఎవలు పెడతరు? ఎవరికి దోసి పెట్టింద్రో ఆళ్లు సేత్తరా? గడ్డకెక్కినంక ఎవ్వలైన సేతులు దులుపు కుంటరు. పెట్టనీకె బిడ్డె గావాలె... సేయ్యనీకె కోడలు గావాలె. ఇంకా ఏ జమాన లున్నరు. బిడ్డైతేంది కోడలయితేంది... అందర్నీ ఒక్క తీర్గ సూడాలెనని మతిలకుండదా ఈళ్లకి.

గిసొంటి చిన్న చిన్నయిటికే దిక్కులేకపాయె... ఇగ ఆస్తుల కాడికి ఒచ్చేట్యాలకు ఎన్ని తాకట్లో, ఎన్ని పంచాదులో.

గియన్ని ఈనకేమన్న పట్టి ఉంటయా అంటే అదీ లేదు. గొంగడి నాది కాదు చెప్పులు నావి కావు అనే రకమే. అమ్మ లెక్క తెలివీ లేకపాయె... అయ్య లెక్క ఇగురమూ లేకపాయె. గిసొంటి ఇంట్ల పడ్డంక నేనేం బావుకున్న గని... ఎట్లనో అట్ల పిల్లలను ఒడ్డుకు చేరిస్తే గదే పున్నెం.

మనసుల మెసుల్తున్నది ఎవల్కి చెప్పుకుంటం? మొగనికి చెప్పుకునే సింగారమే లేకపాయె. ఇగ నేనెట్ల చేతురా భగవంతుడా అని మొగులు దిక్కు సూస్కుంట దండం పెట్టుకునుడు తప్ప. నా మొగనికి... నా పిల్లలకు నేను గాక ఇంకెవరు దిక్కు. నేనుగిట్ల లేకుంటే... నువొద్దె ఆగమయిపోతరు. గదైతే పక్కా. కట్టుకున్నంక... కన్నంక నాకు తప్పదాయె.

**పెండ్లాం**

ప్రేమ లేని మొగనితోటి కాపురం కంటే కనికరంలేని మొగనితోటి కాపురం మోచేతి మీద దెబ్బ తీర్గనే ఉంటది. కడుపు చూడనోడే కడుపు చేసేటోడైతే ఆడదెన్నడు కుదార్తంగ ఉండది... దినాం పొయ్యి మీది అన్నం కుండలెక్క కుతకుత మంటనే ఉంటది.

సముర్తైన యాడాదికి ఈ ఇంట్ల కాలువెట్టిన సంది చాకిరి చేసుడు మొదాలు పెడితే... ఇయ్యాల్టి దాంక... మనుమలూ మనుమరాండ్లూ పెద్దగయితున్నరుగని... నేను చేసే చేత ఆగనే ఆగలె. కూలికొయ్యి కలుపు తీసే ఆడిది టయానికి బొయ్యి టయానికి ఒస్తది గని... నాకు ఏ టైమూ లేకపాయె. పొద్దున్నే కోడి కుయ్యక ముందే ఒంచిన నడుము ఒంచినట్లే ఉంటది... మల్ల పొద్దుమీకి ఇంత ముద్దతిని పక్కల పండుకునే దాంక ఒంగిన నడుము ఎదురుబద్ద లెక్క ఒంగిన తీర్గనే ఉంటది.

ఇప్పుడు చాతనయితుంది సేస్తున్న... రేపు రేపు ఒంట్ల నెత్తురు సచ్చినంక మూలకు వడ్డనాడు ఎవలు జేత్తరో... ఎవలు పెడ్తరో? పెయిల సత్తువ, మూటల ఇత్తులు ఉన్నన్ని నాళ్లే ఎవడైనా కానేది... పెట్టేది. ఆ రెండూ లేనోడు ఎంగిలిస్తారాకే.

పుణ్యం కొద్ది పురుషుడు... దానం కొద్దీ బిడ్డలన్నరు, పుణ్యం చేసే ఒయుసు రాకముందే లగ్గమాయె... ఇగ దానం ముచ్చట సంగతి, నా దగ్గేరేమున్నది దానం జేయ్యనీకె... నేనేమన్నా షావుకార్నా చాటల కమానం దానం జెయ్యనీకెగని... నా పిల్లలు... నువ్వొద్దె రతనాలే. ఏనాడు ఇది గావాలెనని గున్సలే. పెట్టింది తిన్నరు ఇచ్చింది కట్టిన్రు. అడ్డమైన తిరుగుళ్లు తిరగలే... గలీజు సోపతులు పట్టలె.

నా పిల్లలని చెప్పుకునుడు కాదు గని సదువు మీద గింతగనం ప్రేమ గళ్ల పిల్లలను నేనేడ సూడలే. ఒగ దానిమీద మనసు పడ్డరంటే అది దక్కిందాంక ఇడిసి పెట్టనే ఇడిసి పెట్టరు. నా కొడుకంతే... నా బిడ్డంతే. అచ్చం అయ్య సాలె ఒచ్చింది. మొండోల్లు. ఎవ్వరి మాట ఇనరు. ఈననైతే బిడ్డె చెప్పినట్టే ఇంటడు. టీచరు టెయినింగు అయ్యేటప్పుడే ఒగ పోరన్ని తీసుకొచ్చి ఈ పిలగాడ్నే సేసుక్కుంట అనంటే... కుయ్యనలే... కయ్యనలే... బిడ్డె జెప్పిందానికి సైయ్యన్నడు, తలకాయూపిండు. 'మనకంటే తక్వ కులపోళ్లు... గట్లెట్ల,' అనంటే, 'ఆళ్లు ఒక్క తాన సదువుకున్నరు. ముచ్చటవడ్డరు. నడిమిద్దెల మనమెవ్వరం ఒద్దననీకె. చేస్కోనీ. ఆళ్ల బత్కు... ఆళ్లు బత్కనీ. ఇద్దరు ఖుషీగుంటే గంతే సాలు,' అన్నడు. లగ్గమైన యాడాదికే బిడ్డెకు సర్కారు నౌఖరీ తలిగింది. అల్లునికి కూడ మల్ల రెండేండ్లకు నౌఖరీ ఒచ్చింది. పిలగాడు మంచోడే. మంచిగనే బతుకుతున్నరు.

ఈనను సూడబోతే గదే బాపతు. నచ్చింది చేస్తడు. యవుసం తప్ప ఇంగే పనీ రాదు. రాదు అనుడు కంటే చెయ్యడు అనుడు సరిపోతది. ఇంకో పనేమన్న చేస్తే కద? రానీకె. యవుసం మీద ప్రేమ ఒగనాడు ఇడిసిపెట్టేదీ కాదు... ఒగనాడు ఒడిసిపోయ్యేదీ గాదు. దినాం ఇంత ఎక్వనే అయితుంది గని తక్వయ్యే జాడలు కన్లవడలే. దాని మీద పెట్టిన పానంల ఆవగింజంత నా మీద సూపెట్టినా మురుసి పోదును.

ఏం సుఖమున్నదీ మనిసితోటి. ఒక ముద్దూ లేకపాయె ఒక మురిపెమూ లేకపాయె. ఎన్నడన్న అయిన సీరకట్టిన్నా... అయిన సొమ్ము ఎసుకున్ననా? లగ్గమయ్యి ఇన్నేండ్లాయె నా పెయ్యి మీదికి పావులెత్తు బంగారం బెట్టి పుస్తెలకు కట్టుకున్న పగడాల నడుమ ఇటో నాలుగు అటో నాలుగు గుండ్లగ్గూడ నోచుకోనైతిని. ఇసొంటా యన్ను నోరు దెరిసి అడిగితెనే గతిలేకపాయె. ఇంక అడగనిదానికి ఎట్లెదురు సూద్దు. బాయికాడ శేన్ల నడుమ యాపసెట్టు మీద సూపెట్టినంత ప్రేమ గూడ ఎన్నడూ కానక పోతిని.

అమ్మగారింటికాడికెల్లి తెచ్చుకున్న బంగారం గూడ బిడ్డకే పెట్టిచ్చే. 'మల్ల నాకయ్యా బంగారం,' అనంటే, 'సీ... ఏం జేసుకుంటం బంగారం, కడక్క తాగుతమా,' అనే. ఇంగేం మాట్లాడుతం. పోనీ పైసలేమన్న ఆగం చేత్తడా అంటే అదీ కాదు... పుట్టి బుద్దెరిగినప్పటి సంది ఇంత నీసూ ముట్టకపాయె... ఇంత సుక్కా తాగకపాయె. ఒక సుట్టా లేదు, ఒక పోక చెక్కా లేదు. ఇంగేం ఖర్సున్నది... పెట్టనీకె. యాలకింత కడుపుల పడితే ఇంగేం అడుగడు.

మల్ల జరంతసేపు గూడ ఊకె గూసోడు. ఏదో ఒక పని ముందలేసుకొని సేస్తనే ఉంటడు. ఆనకాలం లేకపాయె ... ఎండకాలం లేకపాయె. ఆ శేన్ల నడిమిట్లనే తన్లాడుతుంటడు. మడికట్ల మద్దెల పొర్లాడుతుంటడు. సిన్న కష్టం సేస్తడా? గంత గానం సేశినంక గూడ ఎన్నడు కాలునొచ్చే కడుపునొచ్చే ఆనలే... గొడ్డులెక్క పనిచేస్తడు.

ఎన్నడో నా పెండ్లయిన కొత్తల అన్నదమ్ములు పాలు పంచుకుంటే... ఈన కొచ్చింది ఎకరం బావు. పాలుకొచ్చిన దాంట్లనే తిన్నడు పండిండు. జానెడు జాగ ఉట్టిగుండనియ్యలె. మంచి పంటలు పండించిండు. పండించిందంతా ఇంటికే తోలిండు. బేరమాడుడు రాదని అన్ని నాతోటే అమ్మిపిచ్చిండు. ఆడోళ్లయితే గీసి గీసి బేరమాడుతరంటడు. మల్ల ఒచ్చిన పైసలు నా దగ్గర్నే దాస్తడు. ఆడోళ్లయితే అడ్డగోలు కర్సులు పెట్టరంటడు. ఏమమ్మితే ఎంతొచ్చింది. మొత్తమెన్ని పైసలు కూడినయ్యి... గిసొంటి లెక్కలన్నీ నోటికే ఉంటయి. ఒక్క బుడ్డపైస అటుఇటు కానియ్యడు. పేరుకు పెత్తనం నాది. మల్ల ఆయననుకున్నట్లే సాగిపిచ్చుకుంటడు.

పైసపైస సీమలెక్క కూడబెత్తడు. జరన్ని పైసలు జమయ్యినంక పక్క పోంటున్న భూమి కొంటడు. ఇన్నేండ్లల్ల ఎకరం బావుని పదెకరాలు చేశిండు. ఐదెకరాలు కొడుకు పేరు మీద... ఐదు నా పేరు మీద రిజిస్టరు చేపిచ్చిండు. పిల్ల లిద్దరికీ చెప్పొద్దని ఒట్టుపెట్టిచ్చుకుండు. మల్ల నా పేర జేశ్న భూమి కాయితాలు... కొడుకు పేరు మీద చేశ్న కాయితాలు యేడవెట్టిండో ఇయ్యాల్టి దాంక తెల్వనే తెల్వది. అందరి నడుమ తాకట్లు పెట్టనీకె, ఈళ్ల కాయితాలు ఆళ్లకు... ఆళ్ల కాయితాలు ఈళ్లకు

ఇచ్చిండనంగ ఇన్న. పిల్లలు గూడ నాకు ఇంత ఆయమియ్యరు.

ఎందుకయ్యా నా పేర జేశ్నవు అని బుల్గరిచ్చి అడిగితె, 'కొడుకు పేరు మీద చేపిచ్చినంక, బిడ్డె పేర చెయ్యకపోతే... ఆల్లిద్దరి నడుమ కయ్యం బెట్టినట్టయితది... అందుకనే చెప్పొద్దంటున్న,' అన్నడు.

'మల్ల బిడ్డె పేర చెయ్యక... నా పేర ఎందుకు జేశ్నవు,' అనడిగిన. నన్ను దగ్గరికి పిల్సి, కూసోబెట్టుకొని చెవుల జెప్పిండు. ' రేపేమయితదో ఎవర్కి ఎర్కలే. మంచాయె చెడాయె. నీ పేరు మీద ఇంత ఆస్తి ఉంటే, మనిషి మూలకు పడ్డంక ఆశకన్న బుక్కెడు బువ్వ పెడ్తరు... ఆఖర్కి బిడ్డెకె ఇయ్యి భూమి గని. ఇద్దరి నడుమ పోటీ పెట్టాలె గప్పుడు నీకన్న యాలకింత పెడ్తరు,' అంటడు.

''కన్న పిల్లల మీద ఆశలు పెంచుకోవద్దు... ప్రేమలు పెంచుకోవాలె,'' అనన్న.

''ప్రేమలు ఎల్లకాలం ఉండయి. కడుపులు నింపయి. బతికినన్ని దినాలు ఇవి తప్పయి.''

ఇగో గిసోంటి తాకట్లు పెడ్తడు పిల్లల నడుమ. ఏదన్న అడిగి చేస్తే... గిట్ల కాదు గిట్ల అని చెప్పొస్తది. అన్ని చేశ్నంక... ఊల్లె అందర్కి తెల్సినంక... ఆఖర్కి నాకు తెలుస్తది. ఏం జెయ్యాలె. నెత్తంత తెల్లగయ్యింది గని బుద్ధి మాత్రం రాలే.

చేశేటివన్ని చేస్కుంట పోతనే ఉంటడుగని... గా పన్లెంక ఏందో మతలబు ఉంటదనిపిస్తది. చేసేదానికి... చెప్పేదానికి నడుమ ఏదో సాపెత్యమున్నదనిపిస్తది.

పిల్లల మీద గింతగనం ప్రేమలుంటయా, మల్ల కోడలు పిల్ల తోటి మాట్లా డంగ ఇయ్యాల్టి దాంక సూడకపోతిని. మల్ల దాని మీద ప్రేముండదా అంటే... మస్తు పానం ఎల్లగొట్టుకుంటడు.

తల్లిలేని పిల్ల యాడికోతదని పట్టుబట్టి ప్రతి పండుగకూ ఈడికొచ్చిందాంక ఇడిసిపెట్టనే ఇడిసిపెట్టడు. నాకెప్పుడనిపిస్తనే ఉంటది... ఈనకు బిడ్డె మీద కంటే కోడలు పిల్ల మీదనే ఎక్వ పాయిరమున్నదని. ఓనాడు ఎవ్వరు లేనిది సూషి అడిగిన, ''కోడలు మీద గంత ప్రేముంటది గద...మల్ల దానితోటి నోరుదెరిసి మాట్లాడితె... నోట్ల ముత్యాలు రాల్తయా?'' అని.


గప్పుడు గూడ ఏందో అర్తమయ్యి అర్తం కానట్టు చెప్పిండు. ''గా పిల్ల ఈడి కొచ్చినంక పొద్దుందాంక మీరిద్దరూ ఇంట్లనే కలిసుంటరు. ఒక్క తానుంటే పీకులాట లుంటయ్యి. నేను పలకరియ్యకపోతే... మాట్లాడకుంటె మీరిద్దరూ నా మీద పడి జెప్పుకుంటరు. మనకు దినాం ఎవని మీదనో ఒగని మీద పడి ఆడిపోసుకునుడు గావాలె. నేనే అందుకు దొరికిన్ననుకో మీరిద్దరు ఒక్కటైతరు. రేపు నువ్వు ముసలిగయి నంక బిడ్డె తాన్నో... కోడలు తాన్నో కాలం ఎల్లదీయక తప్పది. గిప్పటి సంది మంచి

గుంటె ఇద్దరి నడుమ ఇంగా మంచి సోపతైతది. తిట్టుకుంట పెట్టె బుక్కెడు బువ్వ కంటే... ప్రేమ తోటి పెట్టె నాలుగు మెతుకులే కమ్మగుంటయ్యి... నాలుగు దినాలు సత్తువిస్తయ్యి,' అంటడు. నాకేం అర్తం కాదు.

పెండ్లయ్యి ఇన్నేండ్లాయె, పిల్లలాయె ఆళ్ల పెండ్లిల్లాయె, ఆళ్లకు గూడ పిల్లలైరి. ఇగ రేపో మాపో మనుమరాలు పెండ్లి గూడ అయితది. అందరు అంతో ఇంతో అర్తమయితరు గని ఈన ఇంగేం అర్తమయితడు? అర్తమయితడు అన్న ఆశా లేదు... అర్తం కాలేదన్న బాధా లేదు. ఏం జేస్తం. ఎవరి ఖర్మ ఎట్ల రాసుంటే అట్లయితది. సంసారమన్నంక నాకు తప్పది. ఇంకెన్ని దినాలు పడాల్నో ఈ బాధలు. ఈ కట్టె కాలిం దాంక ఒడుస్తయన్న నమ్మికం చీమ తలకాయంతగూడ లేదు నాకు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*10 డిసెంబర్ 2017*

*




కొట్టం రామకృష్ణారెడ్డి 24 ఆగస్టు, 1969న రంగారెడ్డి జిల్లా ఘట్‌పల్లిలో జన్మించారు. వీరి మొదటి కథ తీర్పు రచన మాసపత్రికలో ఫిబ్రవరి, 1994లో అచ్చయింది. దాదాపు 15 కథలు రాశారు. మానవ సంబంధాలు, వాటి చుట్టూ అల్లుకున్న భావోద్వేగాలు ఇష్టమైన ఇతివృత్తాలు.

*చిరునామా: 17-1-382/పి/123, గవర్నమెంట్ ప్రెస్ కాలని,*
*చంపాపేట్, హైదరాబాద్ - 500 059.*
*ఫోన్ : 924 6565 824 rkrkottam@gmail.com*